క్లుప్తంగా

కోటసత్తెమ్మ ఆలయానికి భక్తుల తాకిడి

నిడదవోలు రూరల్ : నిడదవోలు మండలం తిమ్మరాజుపాలెం గ్రామంలో ఉన్న కోటసత్తెమ్మ అమ్మవారి ఆలయానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. అధిక సంఖ్యలో తరలివచ్చిన భక్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ ప్రధాన అర్చకులు అప్పారావు శర్మ పర్యవేక్షణలో అమ్మవారికి ప్రత్యేక పుష్పాలంకరణ చేశారు. దర్శనాలు, ప్రసాదం, పూజా టిక్కెట్లు, ఫొటోలు అమ్మకంతో రూ.1,27,975 ఆదాయం వచ్చినట్టు ఆలయ ఈఓ, అసిస్టెంట్ కమిషనర్ వి.హరిసూర్యప్రకాష్ తెలిపారు. ధర్మకర్తల మండలి సభ్యులు, ఆలయ సిబ్బంది సేవలందించారు.

న్యాయబద్ధమైన కోర్కెలు తీర్చడానికి ప్రభుత్వం సిద్ధం

దేవరపల్లి: అంగన్‌వాడీల న్యాయమైన కోర్కెలు తీర్చడానికి జగనన్న ప్రభుత్వం సిద్ధంగా ఉందని రాష్ట్ర హోం, విపత్తుల నిర్వహణ శాఖ మంత్రి తానేటి వనిత అన్నారు. స్థానిక కాకర్ల కల్యాణ మండపంలో ఆదివారం రాత్రి నిర్వహించిన అంగన్‌వాడీలు, ఆశ వర్కర్లు, వలంటీర్ల సమావేశంలో మంత్రి తానేటి వనిత ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. అంగన్‌వాడీల న్యాయమైన కోర్కెల కోసం గత ప్రభుత్వంలో హైదరాబాద్ వెళితే గుర్రాలతో తొక్కించిన విషయం గుర్తుంచుకోవాలని ఆమె తెలిపారు. సమస్యల పరిష్కారం కోసం గౌరవంగా నిరసనలు, ధర్నాలు చేయవచ్చని ఆమె తెలిపారు. ముఖ్యమంత్రిపై పాటలు పాడడం మంచిపద్ధతి కాదని ఆమె చెప్పారు. దీర్ఘకాల సమస్యల పరిష్కారం జగనన్న ప్రభుత్వంలోనే జరిగాయని, గత ప్రభుత్వంలో జరగని అంగన్‌వాడీలకు వేతనాల పెంపు, పదోన్నతులు 2019 తర్వాత జరిగాయనే విషయం మర్చిపోకూడదని ఆమె చెప్పారు. గతంలో ఎప్పుడూ జరగని మేలు గత ఐదు సంవత్సరాలుగా జరిగిందని ఆమె చెప్పారు. ఈ సమావేశంలో ఏఎంసీ చైర్మన్ గన్నమని జనార్ధన రావు, ఎంపీపీ కేవీకే దుర్గారావు, జెడ్పీటీసీ సభ్యురాలు పొట్టి స్వర్ణలత, రాష్ట్ర పామాయిల్ బోర్డు డైరెక్టర్ నరహరిశెట్టి రాజేంద్రబాబు, మండల పార్టీ అధ్యక్షులు కూచిపూడి సతీష్, రాష్ట్ర మహిళా విభాగం ప్రధాన కార్యదర్శి ఆచంట అనసూయ, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆరేటి సూర్యనారాయణ, జిల్లా బీసీ సెల్ అధ్యక్షులు ఎం. గంగరాజు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా పుష్పయాగోత్సవం

ఉండ్రాజవరం: పాలంగిలో బాల త్రిపుర సుందరిదేవి సమేత రామలింగేశ్వర స్వామి, ఉండ్రాజవరంలో బాలా త్రిపుర సుందరి సమేత గోకర్ణేశ్వర స్వామి కల్యాణోత్సవాల్లో భాగంగా ఆదివారం స్వామివారికి రుద్రాభిషేకం, అమ్మవారికి కుంకుమ పూజలు, త్రిశూల స్నానం, పూర్ణాహుతి నిర్వహించారు. సాయంత్రం పుష్పయాగోత్సవం, పవళింపు సేవ ఘనంగా చేశారు. భక్తులు స్వామివారి కల్యాణాన్ని వీక్షించి, తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈకార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్లు కరుటూరి రమేష్, దొడ్డా సూర్యానారాయణ, ఆలయ ఈఓ ఎంవీ రామయ్య, దేవస్థానం కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

చోడేశ్వరస్వామి ఆలయంలో వేదసభ



వేద సభలో పాల్గొన్న వేద పండితులు

కొవ్వూరు: పట్టణంలో ఉమా చోడేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం వేద శాస్త్ర నిర్వాహక సమితి ఆధ్వర్యంలో వేదసభ నిర్వహించారు. వేద పండితులు యజుర్వేదం, శ్రీశుక్ల యజుర్వేదం, సామవేదం తదితర వేదాల్లో నిష్ణాతులైన ఘనపాఠిలు, క్రమపాఠిలు స్మార్తులను 78 మంది వేద పండితులు సత్కరించారు. గండికోట వెంకట సత్యానారాయణ మూర్తి ఆధ్వర్యంలో గత 31 ఏళ్ల నుంచి ఈ వేద సభ కొనసాగిస్తున్నట్లు గండికోట పవన్ కుమార్ తెలిపారు. శ్రీపాద మాణిక్య అవధానులు ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. ఏలూరి పాటి నాగేశ్వరరావు, యల్లాప్రగడ రమేష్, దేవరకొండ సాయి ప్రసాద్ పాల్గొన్నారు.

డ్రగ్ ట్రేడ్ అసోసియేషన్ కార్యదర్శిగా గణపతి



గణపతిని తదితరులను సత్కరిస్తున్న దృశ్యం

తాళ్లపూడి: ది ఈస్ట్ గోదావరి డ్రగ్ ట్రేడ్ అసోసియేషన్‌కు జరిగిన ఎన్నికల్లో తాళ్లపూడి మండలం నుంచి పిండి గణపతి కార్యదర్శిగా ఎన్నిక కావడంపై మండల మెడికల్ అసోసియేషన్ సభ్యులు, కెమిస్టులు అభినందనలు తెలిపారు. రాజమండ్రి చాంబర్ ఆఫ్ కామర్స్‌లో ఆదివారం జరిగిన ఎన్నికల్లో ప్రెసిడెంట్‌గా రాయిపూడి శ్రీనివాసరావు, సెక్రటరీగా తాళ్లపూడికి చెందిన పిండి గణపతి, ట్రెజరర్‌గా కొండేటి శ్రీనివాసరావు ఎన్నికయ్యారు. జిల్లాలోని 19 మండలాలకు చెందిన హోల్ సేల్, రిటైల్ కెమిస్టులు ఓటింగ్‌లో పాల్గొన్నారు. తాళ్లపూడి మండలం మెడికల్ అసోసియేషన్, సీమంధ్ర డ్రగ్ డీలర్స్ అసోసియేషన్ అభినందనలు తెలిపారు.

ఓడించలేక.. ఏకమవుతున్న ప్రతిపక్షాలు

- ప్రజల ఆదరణే జగనన్న బలం
- నాయకులు కార్యకర్తల ఆత్మీయ సభలో మంత్రి తానేటి వనిత
- సీఎం జగన్‌కు అండగా నిలవండి : ఎమ్మెల్యే తలారి

గోపాలపురం: రాజు బలవంతుడైతే శత్రువులంతా ఏకమవుతారన్న చందంగా జగన్‌మోహన్‌రెడ్డి బలవంతుడు కాబట్టే టీడీపీ, జనసేన, బీజేపీ పార్టీలు కలసికట్టుగా ఎన్నికల బరిలోకి వస్తున్నారని రాష్ట్ర హోం, విపత్తుల నిర్వహణ శాఖ మంత్రి డాక్టర్ తానేటి వనిత అన్నారు. ఆదివారం గోపాలపురం మండలంలోని వెంకటాయపాలెం, చెరుకుమిల్లి, చిట్యాల, వేళ్లచింతలగూడెం గ్రామాలలో వైఎస్సార్ సీపీ నాయకులు కార్యకర్తలతో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి వనిత మాట్లాడుతూ రాష్ట్రాభివృద్ధిని చూసి ప్రతి పక్షాలు బయపడి తనకున్న బలం సరిపోక గుంపులుగా తయారై ఎన్నికల బరిలోకి వస్తున్నారని ప్రజలు నమ్మవద్దని ఆమె హితవు పలికారు. సార్వత్రిక ఎన్నికల్లో జరిగే యుద్ధం పేదలకు పెత్తందార్లకు మాత్రమేనని పేద మధ్య తరగతి ప్రజలు ఆలోచించాలని సూచించారు. అనంతరం వేళ్లచింతలగూడెంలో రైతు భరోసా కేంద్రాన్ని ప్రారంభించి సభలో మాట్లాడారు. గోపాలపురం ఏఎంసీ ఆవరణలో వైఎస్సార్ నాలుగో విడతలో భాగంగా 3646 మంది మహిళలకు రూ.6.84 కోట్ల చెక్కును లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి లబ్ధిదారుల మధ్యలో నిలబడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.



వెంకటాయపాలెం ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న మంత్రి వనిత



గోపాలపురం ఏఎంసీ ఆవరణలో చేయూత చెక్కు పంపిణీ చేస్తున్న మంత్రి

మంత్రి వనితను సత్కరించిన ఆటో డ్రైవర్లు : రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆటో డ్రైవర్ల సంక్షేమంగా ఉండాలన్న సంకల్పంతోనే వాహన మిత్ర పథకాన్ని ఏర్పాటు చేసి ఆదుకుంటున్నారని అన్నారు. అనంతరం మంత్రి వనితను ఆటో యూనియన్ సభ్యులు, డ్రైవర్లు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ వుండవల్లి సత్యనారాయణ, జెడ్పీటీసీ సభ్యురాలు కాకులపాటి లలిత, మండల పార్టీ కన్వీనర్ పోతిరెడ్డి నాగరాజు, మహిళా కన్వీనర్ యండపల్లి కవిత, సర్పంచ్‌లు ముళ్లపూడి వరలక్ష్మి, మేకా సతీష్, గోళ్ల కుమార్, పైడి శిరీష, కురుకూరి ధనలక్ష్మి, నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు ఆచంట అనసూయ, నాయకులు దుగ్గిరాల రమేష్‌బాబు, పిన్నమనేని వెంకటరత్నం, కూసం రామమోహన్‌రెడ్డి వెలగా శ్రీరామ మూర్తి, కప్పల వరలక్ష్మి మండల వైఎస్సార్ సీపీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

అన్ని వర్గాలకు మేలు : ఎమ్మెల్యే తలారి వెంకట్రావు

కొవ్వూరు: అన్ని వర్గాలకు మేలు చేకూర్చేలా సంక్షేమ పథకాలు అమలు చేస్తూ సువర్ణ పాలన అందిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ప్రజలంతా అండగా ఉండాలని ఎమ్మెల్యే, నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి తలారి వెంకట్రావు పేర్కొన్నారు. పట్టణంలో మినిబైపాస్ రోడ్డు మార్గంలో నిర్వహించిన చేయూత పథకం నమునా చెక్కుల పంపిణీ సభలో ఆయన మాట్లాడారు. ప్రతి అక్కచెల్లెమ్మ ముఖంలో చిరునవ్వులు చూడాలన్న సంకల్పంతో ప్రతి పథకాన్ని మహిళల పేరుతోనే అందిస్తున్నారన్నారు. గడచిన 58 నెలల కాలంలో వివిధ సంక్షేమ పథకాల ద్వారా మహిళల ఖాతాల్లో రూ.2.78లక్షల కోట్లు జమ చేయడమే ఇందుకు నిదర్శనం అన్నారు.

నియోజకవర్గం వ్యాప్తంగా 10,006 మంది మహిళలకు నాలుగు విడతల్లో రూ.81.25 కోట్లు చేయూత ద్వారా జమ అయ్యాయయన్నారు. చేయూత లబ్ధిదారులకు నమునా చెక్కును ఎమ్మెల్యే వెంకట్రావు చేతుల మీదుగా పంపిణీ చేశారు. మున్సిపల్ చైర్ పర్సన్ బావన రత్నకుమారి, జెడ్పీ వైస్ చైర్ పర్సన్ పోసిన శ్రీలేఖ కూడా సభలో మాట్లాడారు. జెడ్పీటీసీ సభ్యురాలు బొంత వెంకటలక్ష్మి, పట్టణ పార్టీ అధ్యక్షుడు రుత్తల బాస్కరరావు, శ్రీరామ సొసైటీ అధ్యక్షుడు అక్షయ పాత్ర శ్రీనివాస రవీంద్ర, జిల్లా అధికార ప్రతినిధి గంధం శేషసాయి, నాయకులు కంఠమణి రమేష్ బాబు, బత్తి నాగరాజు, చొప్పా అప్పల నాయుడు, దొమ్మేరు సర్పంచ్ తానేటి కుమారి, దాసరి రాయుడు, గుర్రే శరత్, మున్సిపల్ కమిషనర్ కె.దానియేలు జోసఫ్, ఏపీఎం రోజ్ మాణిక్యం, టీఎంసీ జేవీఎస్ఎన్ భవానీ తదితరులు పాల్గొన్నారు.



కొవ్వూరులో చేయూత నమునా చెక్కుని లబ్ధిదారులకు అందజేస్తున్న ఎమ్మెల్యే తలారి



కొవ్వూరు సభకు హాజరైన మహిళలు

జగనన్నను మళ్లీ సీఎంగా గెలిపించుకుందాం

తాళ్లపూడి: జగనన్నను మళ్లీ సీఎంను చేసేందుకు కృషి చేద్దామని కొవ్వూరు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి, ఎమ్మెల్యే తలారి వెంకట్రావు అన్నారు. ఆదివారం ఆయన మండలంలోని పలు గ్రామాల్లోని చర్చిలను సందర్శించి ప్రార్థనల్లో పాల్గొన్నారు. అన్నదేవరపేట, గజ్జరం, పోచవరం గ్రామాల్లో పాస్టర్లు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. తనను గెలుపించి సీఎంను మళ్లీ అధికారంలో కూర్చోబెట్టాలని కోరారు. ఎంపీపీ జొన్నకూటి పోశిరాజు, జెడ్పీ వైస్ చైర్ పర్సన్ పోశిన శ్రీలేఖ, మండల కన్వీనర్ కాకర్ల వెంకటేశ్వరరావు, సర్పంచ్ గండి ర రాంబాబు, వైఎస్సార్ సీపీ నాయకులు పిట్టా శ్రీనివాస్, గన్నిన రత్నాజీ, సుతంగి సురేష్, పి.నాని, జగన్, డాకే రాజు, ఎలిపే ప్రభాకర రాజు, గుంటు చిన్నబ్బాయి తదితరులు పాల్గొన్నారు.



అన్నదేవరపేట చర్చిలో ప్రార్థనల్లో పాల్గొన్న ఎమ్మెల్యే తలారి వెంకట్రావు

డిప్యూటీ విద్యా శాఖాధికారిగా వాసుదేవరావు నియామకం

- నూతనంగా కొవ్వూరు విద్యా డివిజన్ ఏర్పాటు
- డీఎస్ఈవో వాసుదేవరావుకు అదనపు బాధ్యతల అప్పగింత

కొవ్వూరు: జిల్లా పాఠశాల విద్యా శాఖాధికారి కె.వాసుదేవరరావుని కొవ్వూరు డివిజన్ ఉప విద్యా శాఖాధికారిగా పూర్తి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఈ మేరకు ఆదివారం సాయంత్రం ఆయన కొవ్వూరులో ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. జిల్లాల పునర్విభజన అనంతరం కొవ్వూరు విద్యా డివిజన్ నూతనంగా ఏర్పడింది. ఈ డీవైఈవో పరిధిలోకి 18 మంది ఎంఈవోలు, 82 ఉన్నత పాఠశాలలు వచ్చాయి. పాలనా పరమైన సౌలభ్యంలో భాగంగా తొమ్మిది మండలాలు ఈ డివిజన్ ఏర్పాటు చేశారు. నూతన విద్యా డివిజన్ ఏర్పాటు కావడంపై జిల్లా ప్రధానోపాధ్యా యుల సంఘం అధ్యక్షుడు కేవీ రమణరావు హర్షం వ్యక్తం చేశారు. నూతనంగా అదనపు బాధ్యతలు స్వీకరించిన వాసుదేవరావుని డివిజన్ పరిధిలోని హెచ్‌ఎంలు, ఎంఈవోలు మర్యాద పూర్వకంగా కలిసి సత్కరించారు. రాజమహేంద్రవరం డీవైఈవో ఈవీబీఎన్ నారాయణ, కొవ్వూరు ఎంఈవో జె.కెంపురత్నం, ఎంఈవో-2 రామ కిషోర్, రాజానగరం ఎంఈవో జీజేవీవీఎస్ఎన్ ప్రసాద్, ప్రధానోపాధ్యాయుల సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి కోలా సత్యనారాయణ, మంగిన శ్రీరామారావు, రామానుజం తదితరులు పాల్గొన్నారు.



కొవ్వూరు డీవైఈవోగా అదనపు బాధ్యతలు స్వీకరించిన డీఎస్ఈవో వాసుదేవరావుకు స్వాగతం పలుకుతున్న ఎంఈవోలు, హెచ్‌ఎంలు

నేడు నాలుగో విడత చేయూత పంపిణీ

కొవ్వూరు: తాళ్లపూడిలో ఆర్యవైశ్య కల్యాణ మండపంలో సోమవారం ఉదయం పది గంటలకు నాలుగో విడత వైఎస్సార్ చేయూత కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే, నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి తలారి వెంకట్రావు తెలిపారు. 11.30 గంటలకు చాగల్లు మండలం ఉనగట్ల గ్రామంలో నూతనంగా నిర్మించిన రైతు భరోసా కేంద్రం ప్రారంభోత్సవం కార్యక్రమంలో పాల్గొనున్నట్లు తెలిపారు. మధ్యాహ్నం మూడు గంటలకు చాగల్లు కాపు కల్యాణ మండపంలో నిర్వహించే నాలుగో విడత వైఎస్సార్ చేయూత కార్యక్రమంలో పాల్గొంటామన్నారు.

18 నుంచి పది పరీక్షలు

నల్లజర్ల మండలానికి ఏడు పరీక్షా కేంద్రాల కేటాయింపు

నల్లజర్ల: మరో వారం రోజుల్లో పదో తరగతి విద్యార్థులకు పబ్లిక్ పరీక్షలు ప్రారంభం కానున్నాయి. ఈనెల 18వ తేదీ నుంచి 30వ తేదీ వరకు పరీక్షలు నిర్వహించనున్నట్లు ఎంఈఓ వై.సత్యనారాయణ తెలిపారు. మండలంలో మొత్తం ఏడు కేంద్రాల్లో పరీక్షలకు కేటాయించారు. నల్లజర్ల జెడ్పీ హైస్కూలు, సెయింట్ క్లారెట్స్, శిశుస్కూల్, దూబచర్ల, పోతవరం, అనంతపల్లి, తూర్పుచోడవరం జెడ్పీహైస్కూళ్లలో పరీక్షలు జరగనున్నాయని తెలిపారు. మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లోని 1348 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నారు. పరీక్షల నిర్వహణకు 65 మంది ఇన్విజలేటర్లు, ఏడుగురు చీఫ్ సూపరింటెండెంట్లు, ఏడుగురు డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్లను నియమించినట్లు చెప్పారు. ఇన్విజలేటర్లకు 17వ తేదీన శిక్షణ కార్యక్రమం ఉంటుందన్నారు. ప్రతిరోజు పరీక్ష ఉదయం 9.30 ప్రారంభమై మధ్యాహ్నం 12.45లకు ముగుస్తుందన్నారు.

టెన్త్ ప్రశ్నా పత్రాలు పోలీసు స్టేషన్లో భద్రం

నల్లజర్ల: పటిష్ట భద్రత నడుమ పదో తరగతి ప్రశ్నా పత్రాలు ఆదివారం మధ్యాహ్నం నల్లజర్ల పోలీస్ స్టేషన్‌కు చేరాయి. సెట్-1 ప్రశ్నా పత్రాలను రూట్ ఆఫీసర్ కడియం ఎంఈఓ మణికుమార్ వాటిని తీసుకువచ్చారు. ఈ ప్రశ్నా పత్రాలను ఇక్కడి కస్టోడియన్లు ఎంఈఓ వై.సత్యనారాయణ, నల్లజర్ల హెచ్‌ఎం కోమలిచిత్రలతో పాటు ఆయా పరీక్షా కేంద్రాల చీఫ్ సూపరిండెంట్లు, డిపార్టమెంట్ ఆఫీసర్లు స్వాధీనం చేసుకొని లెక్క సరిచూసుకొని నల్లజర్ల పోలీస్ స్టేషన్ స్ట్రాంగ్ రూంలో భద్రపర్చారు. ఈ స్ట్రాంగ్ రూంకు మూడువైపుల సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. కాగా సెట్-2 ప్రశ్నాపత్రాలు సోమవారం వస్తాయని రూట్ ఆఫీసరు మణికుమార్ తెలిపారు. ఇదే రోజు దేవరపల్లి, గోపాలపురం మండలాల్లో కూడ ప్రశ్నా పత్రాలు అందించనున్నట్లు చెప్పారు. ఈనెల 18 నుంచి 30 వరకూ పది పరీక్షలు జరుగనున్నాయి.



పోలీస్‌స్టేషన్ వద్ద ప్రశ్నాపత్రాల బాక్స్‌లు స్ట్రాంగ్‌రూంలో పెడుతున్న కస్టోడియన్లు

వైఎస్సార్ సీపీ 175 సీట్లు సాధించాలని పాదయాత్ర

నిడదవోలు: రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ 175 సీట్లు గెలిపొంది, మళ్లీ సీఎంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రమాణ స్వీకారం చేయాలని ఆకాంక్షిస్తూ మంగళగిరికి చెందిన అభిమాని ఎస్సీ కమిషన్ మాజీ సభ్యుడు కట్టిపోగు బసవరావు చేపట్టిన పాదయాత్ర ఆదివారం నిడదవోలు పట్టణానికి చేరుకుంది. నవంబర్ 17న ఇడుపులపాయ నుంచి ఇచ్ఛాపురం వరకూ బసవరావు పాదయాత్ర రాజమహేంద్రవరానికి 1500 కిలోమీటర్లకు చేరుకుంటుంది. నిడదవోలు మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణతో పాటు పలువురు పార్టీ నాయకులు వసవరావు బృందానికి స్వాగతం పలికారు. మేముసైతం అంటూ వసరరావుతో పాదయాత్ర చేపట్టారు. ఈకార్యక్రమంలో వీరముళ్ళు త్రిమూర్తులు, మేడపాటి రామకృష్ణరెడ్డి, అడపారాజు, గనిరెడ్డి శంకరరావు తదితరులు పాల్గొన్నారు.



నిడదవోలు చేరుకున్న పాదయాత్రలో మున్సిపల్ చైర్మన్ ఆదినారాయణ

వైభవంగా సూర్యనారాయణుని శాంతి కల్యాణం



ప్రత్యేక అలంకరణలో సూర్యనారాయణమూర్తి



కల్యాణాన్ని తిలకిస్తున్న భక్తులు

తాళ్లపూడి: లోక కల్యాణార్థం మాఘమాసంలో నిర్వహిస్తున్న 15వ సౌరయాగం ముగింపు సందర్భంగా ఉష, ఛాయ సమేత సూర్యనారాయణమూర్తి శాంతి కల్యాణ మహోత్సవాన్ని ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఉదయం స్వామివారికి పూజలు నిర్వహించి, శాంతి కల్యాణ మహోత్సవాన్ని వేద మంత్రాల నడుమ శాస్త్రోక్తంగా పండితులు నిర్వహించారు. పలువురు దంపతులు పీటలపై కూర్చుని కల్యాణం నిర్వహించారు. మాఘమాసం నెల రోజుల పాటు 30 ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముగింపు సందర్భంగా పూర్ణాహుతి, రథోత్సవం, హోమం, గోపూజ తదితర పూజలు నిర్వహించారు. సూర్యనారాయణమూర్తిని పుష్పాలు, నూతన వస్త్రాలతో ప్రత్యేకంగా అలంకరించారు. వేదపండితులు కొతవరపు విశ్వనాథ శర్మ మాట్లాడుతూ ప్రత్యక్ష భగవానుడైన సూర్యుడు ఆరోగ్య ప్రదాత ప్రత్యక్ష కర్మ సాక్షి అని అందు వల్ల ప్రతి ఒక్కరు నిత్యం ఆరాధించి ఆరోగ్యాన్ని పొందాలన్నారు. సూర్యభగవానుడి కల్యాణం ద్వారా సకల శుభాలు కలుగుతాయన్నారు. ప్రక్కిలంక, తాళ్లపూడి, పైడిమెట్ట గ్రామస్తులతోపాటు ఇతర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో మహిళలు తరలివచ్చి కల్యాణ మహోత్సవాన్ని తిలకించారు. శశి శేఖర మిత్రబృందం ఆధ్వర్యంలో ఏర్పాట్లను పర్యవేక్షించారు. సుమారు 4 వేల మంది భక్తులకు అన్నదానం నిర్వహించారు. వచ్చిన వారికి తీర్థప్రసాదాలను అందజేశారు.



స్వామివారికి పుష్పయాగోత్సవం

ఘనంగా పుష్పయాగోత్సవం

నిడదవోలు: పట్టణంలోని రాజరాజేశ్వరి సమేత శ్రీగోలింగేశ్వర స్వామివారి ఆలయంలో స్వామివారి కల్యాణోత్సవంలో భాగంగా ఆదివారం స్వామివారికి పుష్పయాగోత్సవం, ఊయలసేవను వైభవంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారికి పూజలు చేశారు. భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. ఆలయ ప్రధాన అర్చకులు శ్రీకాకుళ్లపు వెంకటేశ్వరరావు, ఆలయ ఈవో నామా సూర్యప్రకాష్‌రావు, టి.శిరిష తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలకు ఆకర్షితులై..

గోపాలపురం: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశ పెడుతున్న అభివృద్ధి సంక్షేమ పథకాలకు ఆకర్షితులై టీడీపీ, బీజేపీ పార్టీల నుంచి వైఎస్సార్ సీపీలో చేరుతున్నారని రాష్ట్ర హోం, విపత్తుల నిర్వహణ శాఖమంత్రి డాక్టర్ తానేటి వనిత అన్నారు. వేళ్లచింతలగూడెంలో ఆదివారం వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు పిన్నమనేని చినబాబు ఆధ్వర్యంలో టీడీపీ, బీజేపీ పార్టీలకు చెందిన బేదంపూడి గంగాజలం, వెంకట్రావు, సాయిల బాబూరావు, కొలూరి సువర్ణరాజు, వెంకట్రావు, చినవెంకట్రావు, పెద వెంకట్రావు, కొయ్య రమణ సుమారు 30 మంది నాయకులు, కార్యకర్తలు పార్టీలో చేరారు. వీరికి మంత్రి తానేటి వనిత పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు. సర్పంచ్ గొల్ల కుమార్, ఎంపీటీసీ సనమండ్ర ముక్కయ్య, మండల పార్టీ కన్వీనర్ పోతిరెడ్డి నాగరాజు, మహిళా కన్వీనర్ యండపల్లి కవిత,శాప్ డైరెక్టర్ కప్పల వరలక్ష్మి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



పార్టీలో చేరిన వారికి కండువాలు వేసి ఆహ్వానిస్తున్న మంత్రి వనిత

మద్యం విక్రయిస్తున్న వ్యక్తి అరెస్టు

కొవ్వూరు: పట్టణంలో శ్రీనివాసపురానికి చెందిన నడిపల్లి సత్యనారాయణ అనే వ్యక్తి అనధికారికంగా మద్యం విక్రయిస్తున్న కేసులో ఆదివారం అరెస్టు చేసినట్లు పట్టణ సీఐ వి.జగదీశ్వరరావు తెలిపారు. అతని నుంచి పది బీరు బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నిందుతుడిని సోమవారం కోర్టుకి హాజరు పరచనున్నట్లు తెలిపారు.

గ్రామాల్లో సీఐఎస్‌ఎఫ్ కవాతు



దేవరపల్లిలో కవాతు నిర్వహిస్తున్న సీఐఎస్ఎఫ్ పోలీసులు

దేవరపల్లి: త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల సందర్భంగా గ్రామాల్లో శాంతియుత వాతావరణం ఏర్పాటు కోసం తూర్పుగోదావరి జిల్లాలోని కొవ్వూరు సబ్ డివిజన్ పరిధిలోని గోపాలపురం, కొవ్వూరు, నిడదవోలు నియోజకవర్గాల్లోని గ్రామాల్లో సెంట్రల్ ఇండస్ట్రీయల్ సెక్యూరిటీ ఫోర్స్(సీఐఎస్ఎఫ్) సిబ్బంది కావాతు నిర్వహిస్తున్నట్లు కొవ్వూరు డీఎస్పీ కేసీహెచ్ రామారావు తెలిపారు. మండలంలోని దేవరపల్లి, యాదవోలు, త్యాజంపూడి గ్రామాల్లో ఆదివారం సాయంత్రం కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ రామారావు మాట్లాడుతూ సబ్ డివిజన్ పరిధిలోని ప్రతి గ్రామంలో కవాతు నిర్వహిస్తున్నామన్నారు. వచ్చే ఎన్నికల్లో ప్రజలు స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. దేవరపల్లి సీఐ పి.బాలసురేష్‌కుమార్, ఎస్సై కె. శ్రీహరిరావు, సిబ్బంది పాల్గొన్నారు.

ఉత్తమ సేవలకు గుర్తింపు



అవార్డు అందుకుంటున్న రోటరీక్లబ్ అధ్యక్షుడు కీర్తి ఆంజనేయులు

నిడదవోలు : పాలకొల్లులో ఆదివారం జరిగిన రోటరీ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ సెమినార్‌లో పోలియో ఫండ్ విరాళాల సేకరణకు రోటరీక్లబ్ అధ్యక్షుడు కీర్తి ఆంజనేయులుకు డైమండ్ అవార్డును రోటరీ డిస్ట్రిక్ట్ గవర్నర్ రావూరి సుబ్బారావు, మాజీ గవర్నర్ భరత్ కుమార్ రెడ్డి చేతుల మీదుగా అందజేశారు. ఈసందర్భంగా మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ, రోటరీ అసిస్టెంట్ గవర్నర్ పోలదాసు శ్రీనివాస్, పలువురు రోటరీ సభ్యులు అభినందించారు.

టీడీపీలో నిరసన జ్వాల

- టీడీపీ మాజీ ఎమ్మెల్యే శేషారావును ఉమ్మడి అభ్యర్థిగా ప్రకటించాలి
- టీడీపీ అధిష్టానంతో పోరాటం చేసే దుస్థితి వచ్చింది
- తెలుగు తమ్ముళ్ల ఆవేదన
- త్వరలో చంద్రబాబుకు సినిమా చూపిస్తాం
- కాల్ధారి గ్రామంలో కొవ్వొత్తుల ప్రదర్శన

నిడదవోలు: టీడీపీ, జనసేన పొత్తులో భాగంగా రాజమహేంద్రవరం రూరల్ సీటు ఆశిస్తున్న తూర్పుగోదావరి జిల్లా జనసేన అధ్యక్షుడు కందుల దుర్గేష్‌ను నిడదవోలు పంపాలని అధిష్టానం నిర్ణయించడంతో నిడదవోలు టీడీపీ శ్రేణులు భగ్గుమంటున్నారు. ఉండ్రాజవరం మండలం కాల్ధారి గ్రామంలో టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావుని ఉమ్మడి అభ్యర్థిగా అధిష్టానం ప్రకటించాలని డిమాండ్ చేస్తూ ఆదివారం రాత్రి కొవ్వొత్తుల ర్యాలీ చేపట్టారు. మాజీ ఎమ్మెల్యే శేషారావు నాయకత్వం వర్ధిల్లాలి, శేషారావు జిందాబాద్ అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా టీడీపీ పార్లమెంటరీ నియోజకవర్గ ఉపాధ్యక్షుడు రాచమళ్ల శ్రీనివాస్ మాట్లాడుతూ 2019లో ఎన్నికల్లో నిడదవోలు సీటు కోసం టీడీపీ అధిష్టానంపై పోరాటం చేశామన్నారు. మళ్లీ వచ్చే ఎన్నికలకు అధిష్టానంపై పోరాటం చేయాల్సిన దుస్థితి ఏర్పడిందన్నారు. అయ్యా చంద్రబాబు టీడీపీ కార్యకర్తలకు, అధిష్టానానికి యువ్వం ఏమిటని ఆయన ప్రశ్నించారు. జనసేన నేత కందుల దుర్గేష్‌కు రాజమహేంద్రవరం రూరల్ టికెట్ కేటాయిస్తే మూడు నియోజకవర్గాలు సేఫ్ జోన్‌లో ఉంటాయన్నారు. నిడదవోలు టికెట్ శేషారావుకి ఇస్తే కనుక ఇక్కడ సేఫ్ జోన్‌లో ఉంటుందన్నారు. లేదంటే అధిష్టానం తప్పుడు నిర్ణయాలు తీసుకుంటే జిల్లాలో నాలుగు అసెంబ్లీ స్థానాలు ఓడిపోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుందన్నారు. రాజమహేంద్రవరం రూరల్ ఎమ్మెల్యే బుచ్చయ్య చౌదరిని పిలిపించి అధిష్టానం ఆయకు సర్ది చెప్పి నిడదవోలు టికెట్ కనుక శేషారావుకి కేటాయిస్తే నాలుగు అసెంబ్లీ స్థానాలు గెలుచుకుంటామని లేదంటే ఓడిపోల్సి వస్తోందని ఆయన చంద్రబాబుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో శేషారావుకి మద్దతుగా నిడదవోలు పట్టణంలో పది వేల మందితో నిరసన ర్యాలీ చేశామన్నారు. ఇదీ కేవలం ట్రయిల్ మాత్రమేనని భవిష్యత్‌లో సినిమా చూపిస్తామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నిడదవోలు పట్టణ టీడీపీ అధ్యక్షుడు కొమ్మిన వెంకటేశ్వరరావు నిడదవోలు, ఉండ్రాజవరం, పెరవలి మండలాల అధ్యక్షులు వెలగన సూర్యారావు, సింహాద్రి రామకృష్ణ, అతికాల శ్రీను తదితరులు పాల్గొన్నారు.



కొవ్వొత్తుల ర్యాలీ చేస్తున్న టీడీపీ నాయకులు, కార్యకర్తలు